## క్లుప్తంగా

### రోడ్డు భద్రత అందరి బాధ్యత

• ఎంవీఐ విశ్వనాథరెడ్డి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

**రాయదుర్గంటౌన్:** రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం సేవ్ విజన్ కంటి వైద్యశాలలో డాక్టర్‌మురళి మోహన్ ఆధ్వర్యంలో 15 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. ఎంవీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు.

### బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

**రాయదుర్గంటౌన్:** బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని రాయదుర్గం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుకున్నారు. సీడీపీఓతోపాటు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్, ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ, సీనియర్ ఉపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


**బాల్య వివాహాలతో అనర్థాలు**

**వజ్రకరూరు:** బాల్య వివాహాలు చేయడం వల్ల అనర్థాలు జరుగుతాయని సీడీపీఓ శ్రీదేవి అన్నారు. శుక్రవారం కొనకొండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ కిశోర బాలికా దినోత్సవం నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ కిశోర బాలికలు చక్కగా చదు వుకొని ఉన్నత లక్ష్యం చేరుకోవాలన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేసుకోకూడదన్నారు. అడిషినల్ సీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, పద్మా, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

**రాయదుర్గంటౌన్:** ప్రతి ఒక్కరూ విధిగా ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి పూర్తిగా రక్షణ పొందొచ్చని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని 14వ వార్డు డ్రైవర్స్ కాలనీలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య అవగాహన సదస్సు, క్షేత్రస్థాయిలో డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఆరోగ్య విద్యబోధకుడు లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, శానిటేషన్ సెక్రటరీ నరేష్, హెల్త్ సెక్రటరీలు సరోజ, ఈశ్వరమ్మ, ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


### సస్యరక్షణతోనే దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

**బొమ్మనహాళ్:** సాగు చేసిన పంటల్లో సస్యరక్షణతోనే అధిక దిగుబడి సాధించొచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందవాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగు చేసిన శనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు తగు సూచనలు చేశారు. ఏవో సాయి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు ఎలా తవ్వుతారు?



ఆర్‌అండ్‌బీ అధికారులకు సమస్య తెలియజేస్తున్న జెడ్పీటీసీ నాగరాజు

**కంబదూరు:** నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఎలా తవ్వుతారని, టెలికాం కాంట్రాక్టర్‌పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. మండలంలో ప్రధాన రహదారి పక్కన టెలికాం సంస్థ లైన్ ఏర్పాటుకు రోడ్లు తవ్వించింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని జెడ్పీటీసీ , వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు కదిరిదేవరపల్లి సమీపంలో జరుగుతున్న తవ్వకాలను శుక్రవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడికి వెళ్లి ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీమేష్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు,రాజు,రామాంజి ఉన్నారు.

# తడబడిన సర్కారు చదువు

- నాడు–నేడు పనులపై నీలి నీడలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిన పనులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు





శెట్టూరు కేజీబీవీలో ఆగిపోయిన గదుల నిర్మాణాలు, బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లిలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు

**కంబదూరు:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు కృషి చేశారు. 'నాడు–నేడు' కింద పాఠశాలల ఆధునీకరణ పనులు చేపట్టి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకల సౌకర్యాలూ కల్పించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి సర్కారు.. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. నాడు–నేడు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఓవైపు పనులు నిలిచిపోవడం..మరో వైపు తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాల్లో 297 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నాడు–నేడు పథకంలో భాగంగా మొదటి విడతలో 87 పాఠశాలలను ఎంపిక చేసుకొని రూ.24 కోట్లతో తొమ్మిది రకాల వసతులు కల్పించింది. దీంతో మారిన ప్రభుత్వ బడులను చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషపడ్డారు. చెట్ల కింద చదువులు, నేలపైన కూర్చోవడం, ఇరుకు గదుల్లో అవస్థలు పడడం, ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడం, మధ్యాహ్న సమయంలో చేతిపంపుల వద్ద ప్లేట్లు శుభ్రం చేసుకోవడం, ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకోవడం వంటివి లేకుండా ఉండేది. పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్నామనే భావనను విద్యార్థులకు కల్పించారు.

**ఆగిన ఆధునీకరణ పనులు..**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు పథకం ద్వారా అధ్వానంగా ఉన్న ప్రభుత్వ బడులను బాగు చేయడంతో పాటు మౌలిక వసతులు, అదనపు తరగతుల భవనాల నిర్మాణాలను శరవేగంగా చేపట్టి, ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేశారు. ఎన్నికల ముందు వరకు పనులు వేగంగా సాగాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పాటు ప్రభుత్వం కూడా మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో రెండో విడత కింద ఎంపికైన 213 ప్రభుత్వ పాఠశాలలో ఆధునీకరణ పనులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం బడులపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో అదనపు తరగతి ఆదనపు గదుల నిర్మాణాలు, ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరికొన్ని చోట్ల పూర్తిగా ఆగిపోయాయి. కారణాలు అడిగితే సిమెంట్ కొరత,నిధులు విడుదల కాకపోవడమేనని కాంట్రాక్టర్లు,అధికారులు చెబుతున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై 8 నెలలు కావస్తున్నా ప్రభుత్వం నాడు–నేడు నిధులు విడుదల చేయలేదు. దీంతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఓవైపు పనులు నిలిచిపోవడం.. మరో వైపు తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది.

**కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి పనులు - నిధుల మంజూరు ఇలా..**

| మండలం | మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలు | మొదటి విడతలో మంజూరైన నిధులు | రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు | రెండో విడతలో మంజూరైన నిధులు |
|---|---|---|---|---|
| కళ్యాణదుర్గం | 23 | రూ.7 కోట్లు | 59 | రూ.19.60 కోట్లు |
| కంబదూరు | 17 | రూ.4.13 కోట్లు | 37 | రూ.12.36 కోట్లు |
| శెట్టూరు | 15 | రూ.3.69 కోట్లు | 36 | రూ.4.80 కోట్లు |
| కుందుర్పి | 15 | రూ.6.34 కోట్లు | 38 | రూ.12.99 కోట్లు |
| బ్రహ్మసముద్రం | 17 | రూ.2.55 కోట్లు | 43 | రూ.8.60 కోట్లు |





కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆగిన పాఠశాల భవన నిర్మాణాలు, గతంలో సుందరంగా రూపుదిద్దుకున్న కంబదూరు కేజీబీవీ పాఠశాల

**నిధుల విడుదల కాలేదు**

నాడు–నేడు పథకం ద్వారా రెండో విడతలో ఎంపికైన పాఠశాలలో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. మంజూరైన నిధులను కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేశారు. సిమెంట్ సరఫరా కాకపోవడంతో పాటు నిధులు కూడా మంజూరు కాలేదు. పూర్తి స్థాయిలో నిధులు విడుదలైయితే పనులను త్వరిత గతిన పూర్తి చేయిస్తాం.

– విజయకుమారి, ఎంఈఓ,కళ్యాణదుర్గం

## వారపు సంత..మేం చెప్పిందే వినాలంతా!



మార్కెట్ యార్డ్ ఎదుట స్తంభించిన ట్రాఫిక్



దౌర్జన్యంగా సుంకం వసూలు చేస్తున్నారంటున్న రైతు ములకనూరు బాలు

- మార్కెట్‌యార్డులో టీడీపీ నాయకుల అక్రమ వసూళ్లు
- రసీదు లేకుండానే సుంకం వసూలు

**కళ్యాణదుర్గం రూరల్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత దౌర్జన్యమే ప్రధాన అజెండాగా ఆదాయ మార్గాన్ని ఎంచుకున్నారు. పట్టంలోని మార్కెట్ యార్డులో ప్రతి శుక్రవారం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారు. మార్కెట్‌కు నియోజవర్గంలోని పలు మండలాల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగుచేసిన కూరగాయలను అమ్ముకోవడానికి వారపు సంతకు రైతులు, వ్యాపారులు వస్తుంటారు. మున్సిపాలిటీ సుంకం కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక రైతు, వ్యాపారి నుంచి రూ.20 వసూలు చేసేవారు. టీడీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఒక రైతు నుంచి రూ. 50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. దీనిపై రైతులు నిలదీస్తే కూరగాయలు అమ్ముకోవాలంటే తాము అడిగినంత చెల్లించాల్సిందేనని వ్యాపారులు, రైతులపై దురుసుగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు సుంకం వసూలు చేసి, ఎలాంటి రసీదు ఇవ్వలేదని రైతులు, వ్యాపారులు చెప్తున్నారు.

**టీడీపీ కౌన్సిలర్ భర్త కనుసన్నల్లోనే...**

అక్రమ వసూళ్ల వ్యవహారం టీడీపీకి చెందిన కౌన్సిలర్ భర్త కనుసన్నల్లోనే సాగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి టెండర్ లేకుండానే టీడీపీ నాయకులకు సుంకం వసూలు చేసే బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. కనీసం వారంలో రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు అక్రమంగా టీడీపీ నేతలు వసూలు చేస్తున్నారు. దీనిపై మున్సిపాల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌యార్డు నిర్వాహకులను ప్రశ్నించగా తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్తున్నారని రైతులు అంటున్నారు. శుక్రవారం సంత జరిగే సమయంలో వాహనాలను మార్కెట్‌లోకి అనుమతించకపోవడంతో ట్రాఫిక్ స్తంభించి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. మార్కెట్ యార్డులో అక్రమ వసూళ్లపై మున్సిపాల్ కమిషనర్‌ను అడగ్గా .. వారం సంతలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని అన్నారు.



**• వంట చెరకు కోసం చెట్ల నరికివేత**

**బొమ్మనహాళ్:** మండలంలోని ఉద్దేహాళ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వంట చెరకు కోసం రెండు పెద్ద చెట్లను శుక్రవారం ముక్కలు చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లు నీడనిచ్చేవి. కొన్నిసార్లు ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వంట చేసేందుకు కట్టెలు లేవని మిషన్‌తో చెట్లను మొదలు వరకు కోసి ముక్కలు చేశారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గాలికి చెట్లు కూలిపోవడంతో కొమ్మలు మాత్రమే నరికివేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి చెప్పినట్లు ఆయన తెలిపారు.

## సర్పంచుల ప్రమేయం లేకుండా పనులెలా చేస్తారు?



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి

**కుందుర్పి:** గ్రామాల్లో సర్పంచులు, ప్రాదేశిక సభ్యుల ప్రమేయం లేకుండానే ఉపాధి హామీ పనులు, గోకులం షెడ్లు తదితర అభివృద్ధి పనులు ఎలా చేస్తారని సర్పంచులు, ప్రాదేశిక సభ్యులు అధికారులను నిలదీశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి గ్రామాల్లో సర్పంచులు కేవలం తీర్మానాలు చేసేందుకే పరిమితమయ్యారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను తమ ప్రమేయం లేకుండా చేపట్టడం సరికాదని సర్పంచులు ప్రభాకర్, గోవిందమ్మ, లలితమ్మ, గంగాధర తదితరులు అన్నారు. అభివృద్ధి పనులు పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ భాగస్వామ్యం కల్పించాలని ఎంపీటీసీ సభ్యులు ఈరప్ప,కవిత,అంజినరెడ్డి తదితరులు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ లక్ష్మీశంకర్, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రాదేశిక సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదు పక్కాగా చేయాలి



శిక్షణ ఇస్తున్న ఏఓ పృథ్వీసాగర్

**కళ్యాణదుర్గం:** రబీలో బోరు బావుల కింద సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని కేవీకే కోఆర్డినేటర్ చంద్రాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక కేవీకేలో ఏడీఏ యల్లప్ప అధ్యక్షతన వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా కేవీకే కోఆర్డినేటర్‌తో పాటు ఏడీ యల్లప్ప, పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు ఉషవర్ధిని, వ్యవసాయ అధికారులు జగదీష్, పృథ్వీసాగర్ పలు అంశాలపై శిక్షణ కల్పించారు. ఏఓలు వాసుకీరాణి, సరిత, మహేష్, జాఫర్, విస్తరణాధికారులు దిలీప్, ఆంజనేయులు, రమేష్, కులశేఖర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

**కూరగాయల సాగుపై శిక్షణ**

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణంలోని కేవీకే కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కూరగాయల సాగుపై గ్రామీణ యువతకు శిక్షణ తరగతులు ఇచ్చారు. ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్ మాట్లాడుతూ కూరగాయల సాగులో విత్తనం ఎంపిక ప్రధానమన్నారు. తెగుళ్ల నివారణకు 3గాముల థైరమ్, 3 గ్రాముల ముకోజెబ్‌తో లీటర్ నీళ్లలో కలిపి ముందుగా పిచికారీ చేయాలన్నారు.

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



గవిసిద్ధేశ్వర స్టీల్‌ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

**రాయదుర్గం:** రాయంపల్లి గవిసిద్ధేశ్వర స్టీల్‌ప్లాంట్ వద్ద సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొ(ట్రేసి, సీపీఐ తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ గుమ్మఘట్ట మండలం భూపసముద్రానికి చెందిన బోయ నాగరాజు అనే వ్యక్తి స్టీల్ ప్లాంట్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ, గత ఆరు నెలల క్రితం అకస్మాత్తుగా మృతి చెందాడన్నారు. ఈ మృతిపై అనుమాలు వ్యక్తం కావడంతో విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యం కేవలం రూ.30 వేలు మాత్రమే ఇచ్చి, చేతులు దులిపేశారని మండిపడ్డారు. మృతుడి కుమారుడు ప్రవీణ్, బంధువులతో పాటు మహిళా సమైఖ్య తాలుకా ప్రధాన కార్యదర్శి పార్వతి, కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు నాగరాజు, సీపీఐ మండల కార్యదర్శి దుర్గప్ప, ఏఐవైఎఫ్ తాలూక అధ్యక్షులు కుమార్, కోశాధికారి నవీన్, నాయకులు చౌడప్ప, నాగయ్య, గంగాధర, విష్ణు పాల్గొన్నారు.

### భూముల రీసర్వే పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

**బ్రహ్మసముద్రం :** మండలంలోని గుండిగానిపల్లిలో నిర్వహించిన భూముల రీసర్వేను తహసీల్దార్ సుమతి శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా పరిశీలించి, రైతులకు పొలాల్లో తమ హద్దులను చూపించి, పొలాలకు రస్తా, గుర్తులను చూపించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఆర్‌ఐ నాగిరెడ్డి, సర్వేయర్ సుకర్ణ, వీఆర్వోలు నాగరాజు, మల్లికార్జున , ఆంజనేయులు, రామకృష్ణ, విలేజ్ సర్వేయర్లు హరీష్‌రెడ్డి, సుభేష్ , హర్ష, మల్లికార్జున, శంకర్ రాజు, వీఆర్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

**కణేకల్లు:** విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని సీడీపీఓ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. శుక్రవారం కణేకల్లులోని కేజీబీవీలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు తొలుత ర్యాలీ చేశారు. ' వద్దు వద్దు.. బాల్య వివాహం వద్దు, పెళ్లికెందుకు తొందర.. చదువుకో ముందర, బాలికల చదువును ప్రోత్సహించండి... బంగారు భవిష్యత్తు అందించండి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం సీడీపీఓ, కేజీబీవీ ఎస్‌ఓ మంజుళ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవీ, శాంతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

### పశు ఆరోగ్య శిబిరాల తనిఖీ

**బెళుగుప్ప:** మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలను ఉరవకొండ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో కళ్యాణదుర్గం ఏడీఏ శ్రీనివాసగుప్త, శస్త్ర చికిత్స నిపుణులు హరిణి, పశు వైద్యాధికారులు రమేష్, స్రవంతి పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పశు వైద్య ఉచిత శిబిరంలో పశువులను స్వయంగా పరీక్షలు చేసి, చికిత్సలు అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు మారుతి, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సుధాకర్‌నాయక్, ఎర్రిస్వామి, రవితేజ, వంశీకృష్ణ, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో కౌలు రైతు మృతి

**కూడేరు:** కమ్మూరులో కౌలు రైతు, వైఎస్సార్ సీపీ కార్యకర్త రామకృష్ణ (40) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, మూడు నెలల కూతురు ఉన్నారు. రామకృష్ణ తమకున్న రెండు ఎకరాల పొలంతోపాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రామకృష్ణ మృతదేహానికి సర్పంచ్ రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.6 వేలు అందించారు.

### ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోతే ఎలా?



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శైలజ

**కూడేరు:** ఇళ్లనిర్మాణాల్లో పురోగతి లేకపోతే ఎలా అని గృహ నిర్మాణ శాఖ పీడీ శైలజ ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో హౌసింగ్ పీడీ శైలజ ఉపాధి హామీ , హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. మండల వ్యాప్తంగా 330 గృహాల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో 13 ఇంత వరకు పునాది కూడా తవ్వకోలేదు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలోపు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ హనుమప్ప, ఏపీఓ తులసీ ప్రసాద్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### వ్యాపారులను మార్కెట్ యార్డుకు తరలిస్తాం

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని వినాయక సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ప్రధాన రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని కణేకల్లు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. రోడ్డుపై వ్యాపారాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పోలీసులు, మున్సిపల్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు.

## సంక్షిప్త సమాచారం

**బాల్య వివాహాలను అరికట్టాలి**

**కళ్యాణదుర్గం రూరల్:** బాల్య వివాహాలను అరికట్టాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలికల స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్ భారతి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జయమ్మ, బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నేడు మండల సర్వసభ్య సమావేశం**

**బెళుగుప్ప:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

**పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి**

**కూడేరు:** పశుపోషకులు పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని పశు వైద్యాధికారిణి శ్వేత సూచించారు. మండలంలోని ఎంఎంహళ్లిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు సోకే వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్వేత, ఏహెచ్‌ఏలు ఎర్రిస్వామి, సర్దార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

**పశు ఆరోగ్య శిబిరాలతో ప్రజలకు మేలు**

**వజ్రకరూరు:** పశు ఆరోగ్య శిబిరాలతో మేలు జరుగుతుందని పశువైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ సూచించారు. రాగులపాడు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచు రామాంజనేయులు, జేవీఓ భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు**

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని ఒకటో వార్డులో నివాసం ఉంటున్న గోపాల్ అలియాస్ అహరోను అనే వ్యక్తి రెండు రోజులుగా కనిపించలేదని అతని కుమారుడు శాంతప్ప స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈనెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేశారు.

**వ్యక్తి అదృశ్యం**

**బొమ్మనహాళ్:** మండల కేంద్రానికి చెందిన సురేష్ గౌడ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. ఈ నెల 21న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. ఎవరికైనా తెలిస్తే ఎస్‌ఐ సెల్: 9346010584కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

**వెండి ఆభరణాల అపహరణ**

**బెళుగుప్ప:** మండలంలోని యలగలవంక సమీపంలోని మారెమ్మ ఆలయంలో గురువారం రాత్రి అమ్మవారి వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ శివ తెలిపిన మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి సుమారు రూ.60,000 విలువ చేసే 900 గ్రాముల వెండి కవచాలు, రెండు బంగారు తాలిబొట్లు ఎత్తుకెళ్లారు. అర్చకురాలు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**శనగ పంట కోతలు అడ్డుకున్న వ్యక్తిపై కేసు**

**బెళుగుప్ప:** దుద్దేకుంటకు చెందిన లక్ష్మీదేవి సాగు చేసిన పప్పుశనగ మిషన్‌తో నూర్పిడి చేస్తుండగా భీమలింగయ్య అడ్డుకున్నాడు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ రామదాసు శుక్రవారం తెలిపారు.

**చెత్త సేకరణలో అలసత్వం తగదు**

**కూడేరు:** చెత్త సేకరణలో అలసత్వం తగదని ఈఓఆర్డీ రాధాకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఆయన కొర్రకోడు, జల్లిపల్లిలో పంచాయతీల్లోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కొర్రకోడు సర్పంచ్ చంద్రశేఖర్ , పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ , పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

**కైరేవులో వ్యక్తిపై కత్తితో దాడి**

**శెట్టూరు:** మండలంలోని కై రేవు గ్రామంలో అంజి అనే వ్యక్తిపై మేనల్లుడు రంగస్వామి కత్తితో దాడి చేశాడు. శుక్రవారం గ్రామానికి చెందిన రంగస్వామి, శంకర్ గొడవపడుతుండగా మేనమామ అంజి సర్దిచెప్పాడు. రెచ్చిపోయిన రంగస్వామి.. అంజిపై కత్తితో దాడి చేశాడు. అంజి మెడకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**హైరిస్కు గర్భిణులను నిర్లక్ష్యం చేయొద్దు**

**కూడేరు:** హైరిస్కు గర్భిణుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయొద్దని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం కూడేరుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 524 మంది గర్భిణులుంటే 137 మంది హైరిస్కు గర్భిణులున్నారు. తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.